

కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు
- ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు
- అనకాపల్లి జిల్లా సర్కిల్ ఎస్ఈగా గొప్ప ప్రసాద్
- అల్లూరి సీతారామరాజు సర్కిల్ ఎస్ఈగా జీఎన్ ప్రసాద్

- 7లో



హుకుంపేటలో సబ్‌కలెక్టర్ సీజ్ చేసిన ఇసుక లారీలు, ట్రాక్టర్లు

ఇసుకకు కటకట

ఉచిత ఇసుక ఏదీ?, ఎక్కడా?

- రీచ్‌లు లేక అవస్థలు పడుతున్న జనం
- గెడ్డల్లో ఇసుక సేకరిస్తే పట్టుకుని వాహనాలు సీజ్ చేస్తున్న అధికారులు
- ఇసుకపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్న జనం, లారీల ఆపరేటర్లు
- రెండు రోజులుగా వాహనాలు ఆపేసి నిరసన తెలుపుతున్న వైనం



పాడేరులో రెండు రోజులుగా నిలిపి వేసిన లారీలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలో ఉచిత ఇసుక ఊసే లేకపోగా, స్థానికంగా గెడ్డల్లోంచి సేకరించి రవాణా చేస్తే అధికారులు ఆయా వాహనాలను పట్టుకుని సీజ్ చేస్తున్నారు. దీంతో రెండు రోజులుగా లారీలను నిలిపి వేసి యజమానులు నిరసన తెలుపుతున్నారు. ప్రస్తుతం ఇసుక దొరకని పరిస్థితిలో అధికారుల చర్యల వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని పలువురు అంటున్నారు.

జిల్లాలో చింతూరు డివిజన్ పరిధిలోని ఏటపాక ప్రాంతంలో గుండాల వద్ద మాత్రమే రెండు ఇసుక రీచ్‌లున్నాయి. పాడేరు డివిజన్ పరిధిలోని పదకొండు మండలాల్లో ఎక్కడా కూడా ఎటువంటి ఇసుక రీచ్‌లు లేవు. దీంతో ఇక్కడి ప్రజలకు ఉచిత ఇసుక అందుబాటులో లేని పరిస్థితి కొనసాగుతున్నది. దీంతో తమకు అందుబాటులో ఉన్న గెడ్డల్లోని ఇసుక సేకరిస్తూ లారీలు, ట్రాక్టర్లలో రవాణా చేసుకుంటున్నారు. అలాగే ఏజెన్సీలోని ఇసుక నాణ్యత లేకపోవడంతో పాటు 15 నుంచి 20 శాతం సిల్ట్ ఉండడంతో ఈ ఇసుకను విక్రయించేందుకు గతంలో ప్రభుత్వం సాహసించలేదు. గత కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇసుక సేకరణ, రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా.. స్థానిక గెడ్డల్లో ఇసుకను సేకరిస్తున్న ప్రతి లారీ నుంచి రూ.300 రుసుమును పంచాయతీలకు చెల్లించి ఇసుక సేకరించేలా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో లారీకి రూ.300 చెల్లిస్తూ స్థానిక గెడ్డల్లో ఇసుకను నిర్మాణ పనులకు ఏజెన్సీలో వినియోగిస్తున్నారు.


సబ్‌కలెక్టర్ దాడులతో ఇసుక సమస్య

స్థానిక సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఇటీవల హుకుంపేట మండలంలో పర్యటించినప్పుడు కామయ్యపేట ప్రాంతంలోని గెడ్డలో ఇసుకను లోడ్ చేస్తున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. అలాగే ఇసుకను గెడ్డల్లో సేకరిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో గత మూడు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా ఇసుక సేకరణ, రవాణా ఆగిపోయింది. దీంతో నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గతంలో కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల వ్యవహారాన్ని సైతం లారీ యజమానులు సబ్‌కలెక్టర్‌కు తెలిపినప్పటికీ కనీసం పట్టించుకోలేదు. ఈ క్రమంలో రెండు రోజులుగా లారీలను నిలిపివేసి యజమానులు తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఏదో ఒక నిబంధనను పక్కాగా అమలు చేసి ఇసుక సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తున్నామని చెబుతుండగా ఇక్కడ అధికారుల చర్యలతో ఏ విధంగానూ ఇసుకను పొందలేని స్థితి ఏర్పడడం కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరును తెస్తుందని పలువురు అంటున్నారు. జిల్లా అధికారులు మన్యంలో ఇసుక సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు, లారీల యజమానులు కోరుతున్నారు.

అందాల జలపాతాలు ఆదమరిస్తే ప్రమాదాలు

అక్కడి పరిస్థితులపై అవగాహన లేక ఎందరో మృతి

- మృతుల్లో ఎక్కువ మంది యువతే
- హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో విషాదం
- కొందరు ఫొటోలు, సెల్ఫీల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనం
- జిల్లాలో వారం రోజుల వ్యవధిలో ఐదుగురు మృత్యువాత



అనంతగిరి మండలంలోని సరియా జలపాతం

అనంతగిరి, సెప్టెంబరు 24:

జిల్లాలో కనువిందు చేసే జలపాతాలు ఎన్నో ఉన్నాయి. వీటిని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వీరిలో యువతే ఎక్కువగా ఉంటారు. కొత్త ప్రదేశం కావడంతో అక్కడి పరిస్థితులపై అవగాహన లేక ఈతకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు ఫొటోలు, సెల్ఫీల కోసం సాహసాలు చేస్తూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. వారం రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా ఉన్న జలపాతాల వద్ద జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అనంతగిరి సరియా జలపాతం 2015లో బాహ్య ప్రపంచానికి పరిచయమైంది. అనతికాలంలోనే పర్యాటక ప్రాంతంగా పేరొందింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పర్యాటకులు సరియా జలపాతాన్ని తిలకించేందుకు భారీగా తరలి వస్తుంటారు. 2015 నుంచి 2024 మధ్య కాలంలో 40 మందికి పైగా పర్యాటకులు ఈ జలపాతం వద్ద మృతి చెందారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో రెండేళ్ల క్రితం అనంతగిరి పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. ఈ జలపాతం మూడు స్టెప్‌లుగా ఉంటుంది. మొదటి స్టెప్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో పర్యాటకులు వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. దీంతో గత రెండేళ్లుగా ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోలేదు. అయితే రెండవ స్టెప్‌లో ఉన్న బహుబలి జలపాతం వద్ద ఈ నెల 14వ తేదీన విజయనగరం బాబామెట్టకు చెందిన సాయి కుమార్, విశాఖపట్నం నేవీకి చెందిన దిలీప్‌కుమార్ మృతి చెందారు. వీరి

... మిగతా 6వ పేజీలో



ఎక్కువ ప్రమాదాలు జరిగిన అనంతగిరి సరియా జలపాతం వద్ద మొదటి స్టెప్ ప్రాంతం



పిట్టలబొర్రా జలపాతం

ఐటీడీఏ మారదంతే!

గత వైసీపీ పాలన తరహాలోనే అడ్డగోలు వ్యవహారం

- టీడబ్ల్యూ డీడీని పక్కన పెట్టి అనధికారికంగా ఫైళ్ల నిర్వహణ
- అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఐటీడీఏ కార్యాలయంలో ఇష్టారాజ్యంగా సాగిన అడ్డగోలు వ్యవహారాలు కూటమి ప్రభుత్వం వచ్చినా కొనసాగుతుండడం విమర్శలకు తావిస్తోంది. గిరిజన సంక్షేమ విద్యాశాఖలో గత పాలకుల పోకడలే కొనసాగుతుండడం దీనికి నిదర్శనం. ప్రస్తుతం ఉన్న గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడిని పక్కన పెట్టి, అనధికారికంగా పలు ఫైళ్లను నిర్వహించడంతో ఈ అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



పాడేరు ఐటీడీఏ కార్యాలయం

గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీగా కొండలరావు పని చేస్తున్నప్పటికీ ఆయనను ఐటీడీఏ అధికారులు పక్కన పెట్టి, ఆయన చేయాల్సిన పనులను అనధికారికంగా మరో మండల స్థాయి అధికారితో చేయిస్తున్నారు. తాజాగా మాతృభాషా వలంటీర్ల వేతనాలకు సంబంధించిన ఒక ఫైలు, జీసీసీలో సరకుల టెండర్లకు సంబంధించి మరో ఫైలును అనధికారికంగా ముందుకు కదిలించారు. వాస్తవానికి ప్రస్తుతం టీడబ్ల్యూ డీడీగా ఉన్న అధికారితోనే ఆయా ఫైళ్లను నిర్వహించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ఐటీడీఏ అధికారులు అడ్డగోలుగా ఈ వ్యవహారాన్ని సాగించారు. ఈ పరిణామంతో తమకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కార్యాలయంలోని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి చర్యలతో సర్వీసుపరమైన ఇబ్బందులు వస్తాయని అంటున్నారు.

అయితే ఈ అడ్డగోలు వ్యవహారాలను ఐటీడీఏ అధికారులే స్వయంగా చేయిస్తుండడంతో ఈ సమస్యను ఎవరితో చెప్పుకోవాలని టీడబ్ల్యూ డీడీ కార్యాలయ సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఐటీడీఏ కార్యాలయంలో జరుగుతున్న ఈ అడ్డగోలు వ్యవహారానికి తెర దించి, నిబంధనల మేరకు సజావుగా కార్యకలాపాలు జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బజారున పడిన ఐటీడీఏ పరువు

గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావును ఇక్కడ నుంచి రంపచోడవరం బదిలీ చేస్తున్నట్టు ఈ నెల 9న జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ జారీ చేసిన బదిలీ ఉత్తర్వు నేటికీ చెల్లుబాటు కాలేదు. వాస్తవానికి టీడబ్ల్యూ డీడీని బదిలీ చేసే అధికారం కలెక్టర్‌కు లేదని, ఆ ఉత్తర్వు నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన సంగతి ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. టీడబ్ల్యూ డీడీ పని తీరు బాగోకపోతే ప్రభుత్వం అనుమతితో కలెక్టర్ ఆయనను సరెండర్ చేయవచ్చు. కానీ ఆయనను బదిలీ చేసే అధికారం కేవలం ప్రభుత్వానికి మాత్రమే ఉంటుంది. పైగా మరో 15 నెలల్లో పదవీ విరమణ చేయనున్నా టీడబ్ల్యూ డీడీని ఎటువంటి బలమైన కారణం లేకుండా బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధం. అయితే అవేవీ పట్టించుకోకుండా ఆయనను రంపచోడవరం బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయనను స్థానిక టీడబ్ల్యూ డీడీ పోస్టు నుంచి రిలీవ్ చేయాలని పాడేరు ఐటీడీఏ పీవోను, టీడబ్ల్యూ డీడీగా జాయినింగ్ చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవోకు కలెక్టర్ ఆదేశించారు. అయితే కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో స్థానిక ఐటీడీఏ పీవో అభిషేక్ ఆయనను(టీడబ్ల్యూ డీడీ) రిలీవ్ చేయలేదు. వాస్తవానికి ఈ వ్యవహారంలో ప్రభుత్వం జీవో జారీ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో దానిని ఐటీడీఏ పీవోలు అమలు చేయలేని దుస్థితి నెలకొంది. దీంతో ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కలెక్టర్ ఉత్తర్వు అమలు చేయని స్థానిక ఐటీడీఏ పీవో అభిషేక్.. టీడబ్ల్యూ డీడీని పక్కన పెట్టి అనధికారికంగా కార్యాలయంలోని ఫైళ్లను నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధమైన మరో అడ్డగోలు వ్యవహారానికి తెర తీశారు. దీంతో ఐటీడీఏలో జరుగుతున్న ఈ వ్యవహారం జిల్లా వ్యాప్తంగా పాడేరు ఐటీడీఏ పరువును బజారున పడేస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు పాలన సాగించాలని గిరిజనులు కోరుతున్నారు.

వరించిన నామినేటెడ్ పదవులు

టూరిజం కార్పొరేషన్ సభ్యుడిగా టీడీపీ నేత రమేశ్‌నాయుడు, ట్రైకార్ సభ్యుడిగా బీజేపీ నేత కృష్ణారావు నియామకం

పాడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, సభ్యులను నియమించిన కూటమి ప్రభుత్వం ఏజెన్సీకి చెందిన ఇద్దరు కూటమి నేతలకు నామినేటెడ్ పదవులు కేటాయించింది. పాడేరుకు చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకటరమేశ్‌నాయుడును టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కమిటీ సభ్యుడిగా, జి.మాడుగులకు చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత కూడా కృష్ణారావును ట్రైబల్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమించింది. గిరిజన ప్రాంతానికి చెందిన ఇద్దరు నేతలకు నామినేటెడ్ పదవులు దక్కడంపై కూటమి నేతలు, క్యాడర్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కేపీ రమేశ్‌నాయుడు



కూడా కృష్ణారావు

అనకాపల్లి జిల్లాలో ఇద్దరికి కీలక పదవులు



పీలా గోవింద సత్యనారాయణ



బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా చోడవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు నియమితులయ్యారు. అలాగే ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా టీడీపీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీజీ కుమార్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకుడు బోడపాటి శివదత్తు నియమితులయ్యారు.

సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి

పాడేరు డివిజన్‌కు ఏడు, అరకులోయ పరిధిలో ఏడు చొప్పున బర్త్ వెయిటింగ్ హాళ్లు మంజూరు

- 27న పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పాడేరు డివిజన్ అధికారులతో ప్రత్యక్షంగాను, రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించిన వంద రోజుల్లో పూర్తి చేయాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మల్టీపర్పస్ భవనాలు, జన్‌మన్ పథకంలో మంజూరు చేసిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే భవన నిర్మాణాలు, గోకులాల షెడ్లు, బర్త్ వెయిటింగ్ హాళ్లు, ఇతర పనులన్నింటికీ నిధులు వస్తాయని, జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాడేరు డివిజన్‌కు ఏడు, అరకులోయ పరిధిలో ఏడు చొప్పున బర్త్ వెయిటింగ్ హాళ్లు మంజూరు చేశామని, పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 170 పనులు మంజూరు చేశామని, 45 పనులు పూర్తి చేశారని, మిగిలిన పనులు నవంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. 72 తారురోడ్లలో 14 పూర్తి చేశారని, మిగిలిన రోడ్డు పనులు డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాడేరు పంచాయతీరాజ్ యూనిట్స్ విభాగంలో 28 రోడ్డు పనులకు 6 పూర్తయ్యాయని, 22 సీసీ రోడ్లకు 12 పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రోడ్లు, భవనాల శాఖకు 26 పనులు అప్పగించామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ అభిషేక్‌గౌడ్

'క్యూఆర్' కోడ్ ద్వారా ప్రజల ప్రతి స్పందన సేకరణ

స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్- 2047 లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తోందన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్వర్ణాంధ్రా: 2047పై ప్రజల ప్రతిస్పందన సేకరించాలన్నారు. పేదరికం లేని సమాజం, నైపుణ్యం గల యువత, అందరికీ ఆరోగ్యం, సుసంపన్నమైన సమాజం ఉండాలని కోరుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. అధికారులు ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పర్యాటక సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అన్ని పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక రంగంలో సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలని, పర్యాటక ప్రాంతాల్లో మెరుగైన పారిశుధ్యాన్ని నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ టి.కొండయ్యపడాల్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాల సుందరబాబు, జిల్లా టూరిజం అధికారి జి.దాసు, జిల్లాలోని 22 మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే

అరకులోయ, సెప్టెంబరు 24: మండల కేంద్రంలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. కో-ఎడ్యుకేషన్ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, మహిళా కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.చలపతిరావు పాల్గొని మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యాలను వలంటీర్లకు వివరించారు. పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి, నాగబాబు మాట్లాడుతూ మై భారత్ పోర్టల్, డిజిటల్ లిటరసీ గురించి వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే 5కే రన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలైన వలంటీర్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

చిలకలగెడ్డలో పొలం పిలుస్తోంది..

అనంతగిరి, సెప్టెంబరు 24: మండలంలోని చిలకలగెడ్డలోని మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. మెళకువలతో వరి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. అలాగే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు, ఏవో ఉమామహేశ్వరి, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు టి.మితుల, టీడీపీ నాయకుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతు



గుమ్మ రోడ్డును బాగు చేసుకుంటున్న గిరిజనులు

అనంతగిరి, సెప్టెంబరు 24: మండలంలోని మారుమూల గుమ్మ పంచాయతీ కేంద్రానికి వెళ్లే గ్రావెల్ రోడ్డును గిరిజనులు శ్రమదానంతో బాగు చేసుకున్నారు. బీఎండబ్ల్యూ నిధులతో పెదబిడ్డ నుంచి గుమ్మ మీదుగా నిమ్మవూట వరకు తారు రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా గ్రావెల్ వేశారు. అయితే పెదబిడ్డ నుంచి గుమ్మ గ్రామ సమీపం వరకు మాత్రమే కాంట్రాక్టర్ తారు రోడ్డు వేసి, మిగిలిన రెండు కిలోమీటర్లు వదిలేశారు. దీంతో వర్షాలకు పూర్తిగా గ్రావెల్ కొట్టుకుపోయి రోడ్డు అధ్వానంగా మారింది. దీన్ని గిరిజనులు తాత్కాలికంగా బాగుచేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రెండు కిలోమీటర్లకు రూ.80 లక్షలు మంజూరైనా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సర్పంచ్ రాములమ్మ, తదితరులు వాపోయారు. పీఆర్ అధికారులు స్పందించి తారు రోడ్డును పూర్తి చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చలపతిరావు

అరకులోయ, సెప్టెంబరు 24: మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పట్టాసి చలపతిరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు చలపతిరావు కళాశాల ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కో-ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, కళాశాలల అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సిహెచ్.రామకృష్ణ వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉండడంతో ఇంతవరకు ఇదే కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు వహిస్తున్న చలపతిరావుకు ఉన్నత విద్యాశాఖ అధికారులు ప్రిన్సిపాల్‌గా ఎఫ్ఏసీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాలు

హుకుంపేట, సెప్టెంబరు 24: గిరిజన రైతులకు రాయితీపై కూటమి ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలను అందిస్తున్నదని వ్యవసాయాధికారి లీలావతి తెలిపారు. మండలంలోని మఠం పంచాయతి బొడ్డపుట్టు గ్రామంలో మంగళవారం సర్పంచ్ శాంతికుమారి అధ్యర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రైతులకు వ్యవసాయ పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువులతో సాగుబడి చేస్తే భూమి సారం పెరుగుతుందని, అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మత్స్య కొండబాబు, రామలింగం, కన్నారావు, వ్యవసాయ సిబ్బంది ప్రియంక మోహన్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు

మెళకువలతో అధిక దిగుబడులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 24: కాఫీ, మిరియాల సాగులో చిన్నపాటి మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో శ్రీనివాస్‌బాబు సూచించారు. మండలంలోని కుంబిరిపడ, ఒంటిపుట్టు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు కాఫీ, మిరియాల సాగుపై అవగాహన కల్పించారు. వరి, చోడి, సాములు పంటలలో మేలైన సాగు పద్ధతుల ద్వారా అధిక దిగుబడులను పొందే విధానాలపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, పశు సంపద ఆవశ్యకత, ప్రకృతి వ్యసాయంలో గోమూత్రం, పేడ వంటి పదార్థాలతో పాటు కషాయాల తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

పాడేరు రూరల్, సెప్టెంబరు 24: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎన్.రసూల్ పిలుపునిచ్చారు. కళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రమేష్‌బాబు, గణేష్, దామోదరరావు, గౌరీశంకరరావుల ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1990 నుంచి ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కళాశాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి గిరిజన గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

27న చోడిరాయిలో మెగా వైద్య శిబిరం

సీలేరు, సెప్టెంబరు 24: గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని చోడిరాయి గ్రామంలో ఈ నెల 27వ తేదీన గిరిజన సంఘం, ప్రజా ఆరోగ్య వేదిక శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ తెలిపారు. ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల పరిధిలోని గ్రామాల గిరిజనులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అతని వెంట గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షుడు బాకూరి కోటేశ్వరావు ఉన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- పీవీటీజీలకు భారీ సంఖ్యలో పక్కా గృహాలే మంజూరు
- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, సెప్టెంబరు 24: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మండంలోని కొత్తపాలెం పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. పాడేరు, అరకు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించకపోయినా ఆదివాసీలపై చంద్రబాబుకు అపారమైన ప్రేమాభిమానాలు చూపిస్తున్నారన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను మంజూరు చేస్తున్నారన్నారు. జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా పీవీటీజీలకు నియోజకవర్గంలో ఒక్కొక్క మండలానికి 1500-2000 గృహాలు మంజూరయ్యాయన్నారు. వర్షాలకు గృహాలు, పంటలు నష్టపోయిన గిరిజనులకు పరిహారం మంజూరు చేశారన్నారు. అలాగే సీలేరు రహదారి నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సహకారంతో ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వాతాతలకు రూ.4 వేల పింఛన్ పెంచడంతో పాటు మెగా డీఎస్సీ ప్రకటించారన్నారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించిందని ఆమె వివరించారు.

అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేను ఎన్నుకోవడం దురదృష్టకరం

అసెంబ్లీకి వెళ్లని వ్యక్తిని ఎమ్మెల్యేగా పాడేరు నియోజకవర్గ ప్రజలు ఎన్నుకోవడం దురదృష్టకరమని టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేస్తారని ఆదివాసీలు ఎంతో ఆశతో విశ్వేశ్వరరాజును గెలిపిస్తే జగన్‌రెడ్డితో పాటు శాసనసభకు ఎగనామం పెడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఎవరు ప్రజల కోసం పనిచేస్తారో గుర్తించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మద్దతుదారులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, కిల్లో రమేశ్ నాయుడు, నాయకులు చల్లంగి జ్ఞానేశ్వరి, బొర్రా విజయరాణి, కిట్లంది పద్మ, దివ్య, కిల్లో పూర్ణచంద్రరావు, రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, ఆంద్రాబు లక్ష్మణ్, పాంగి రాము, బుజ్జిబాబు, బాలక్రిష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

కూటమితోనే ప్రజా శ్రేయస్సు

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వంతోనే ప్రజా శ్రేయస్సుకు ఆస్కారం కలుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. కొర్రాయి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ కొములు అధ్యక్షతన మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. వంద రోజుల ప్రభుత్వ పాలనను ఇంటింటికీ వెళ్లి గిరిజనులకు వివరించారు. అనంతరం మామిడివలసలో పార్టీ యూనిట్ ఇన్‌చార్జి ఆనంద్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం భవిష్యత్తు కార్యక్రమాలను వివ రించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు గంగాధర్, చంటీ మోహన్‌దాసు తదితరులు పాల్గొన్నారు.



కొర్రాయిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తాటిగుడలో 'ఇది మంచి ప్రభుత్వం'

అనంతగిరి: మండలంలోని తాటిగుడ గ్రామంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. టీడీపీ యువ నాయకులు ఎం.రంజీత్, పి.బాబీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికించారు. సమస్యలు తెలిపితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రజలకు వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగులు, పి.భీమన్న, సచివాలయ ఉద్యో గులు రాజశేఖర్, సంధ్య రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే యువతకు ఉజ్వల భవిత

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్

హుకుంపేట, సెప్టెంబరు 24: విద్యతోనే యువతకు ఉజ్వల భవిత ఉంటుందని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ చెప్పారు. మండలంలోని తీగలవలస పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మర్రి కామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు అలాగే వృద్ధులకు దుప్పట్లు, ఆరు గ్రామాల గిరిజన యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. లాగే సీఐ నాయుడు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని సూచించారు. గిరిజన యువతీ, యువ కులు చదువుపైనే దృష్టిసారించాలని, చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని కోరారు. తమ ఆగ్రామాలు అభివృద్ధికి కృషి చేయాలని, సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. చెడు మార్గాల్లో పయనించి జీవితాలను నాశనం చేసుకోవద్దని, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ కుటుంబంలోనూ పిల్లలకు పాఠశాలలకు పంపించాలని, వారిని విద్యావంతులుగా తీర్చి దిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సురేష్, సర్పంచ్ జేసు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు

2న పకనకూడిలో పీఎం జనమన్: పీవో అభిషేక్

అరకులోయ, సెప్టెంబరు 24: మండలంలోని పకనకూడి గ్రామంలో వచ్చే నెల 2న పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మంగళవారం కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవోతో పాటు గద్యగుడ గ్రామానికి చెందిన పీవీటీజీ మహిళ స్వాబి గంగ పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం పీవో మాట్లాడుతూ అరకు నుంచి గంగ జార్ఖండ్ వెళ్లి ప్రధానమంత్రితో నేరుగా ముచ్చటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మ్యూజియం మేనేజర్ మురళి, వెలుగు అధికారి కృష్ణారావు, సిబ్బంది గణపతి పాల్గొన్నారు.

కరాటేతో చదువులో రాణించే శక్తి



రెజ్లింగ్ అకాడమీ కోచ్ నూకరాజును సత్కరిస్తున్న కరాటే క్లబ్ చీఫ్

కొయ్యూరు, సెప్టెంబరు 24: కరాటే శిక్షణ తీసుకోవడం వలన చదువులో కూడా రాణించే అవకాశం కలుగుతుందని కోపుకాన్ కరాటే క్లబ్ చీఫ్ బాకూరి పాండురాజు చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-2లో మంగళవారం విద్యార్థులకు కరాటే యోగా శిక్షణ తరగతులను హెచ్‌ఎం బి.మురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండురాజు మాట్లాడుతూ కరాటే వల్ల ఫిజికల్ ఫిట్‌నెస్ చేకూరి చదువు, ఎంచుకున్న ఏ రంగంలోనైనా ముందుకు వెళ్లేలా ఆసక్తి పెంచుతుందన్నారు. అనంతరం కరాటేలో ప్రావీణ్యత పొందేందుకు అవసరమైన మెళకువలను వివరించారు. కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీకి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా శిక్షణ పొందిన పలువురు విద్యార్థులకు, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా తర్ఫీదు ఇస్తున్న కోచ్ నూకరాజుకు పాండురాజు దుశ్శాలువ కప్పి సత్కరించారు.

గేటు పునఃప్రారంభించాలని ఆందోళన



జాతీయ రహదారిలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 24: కించుమండ గిరిజన ప్రాథమిక పాఠశాలలో గేటును పునఃప్రారంభించి చిన్నారుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించి వారంతా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల యాజమాన్యం ప్రహరీ గోడ నిర్మించడంతో గేటును తొలగించారని, దీంతో చిన్నారులు జాతీయ రహదారి మీదుగా పాఠశాలకు చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా గేటును పునఃప్రారంభించాలని వేడుకుంటున్నా పాఠశాల యాజమాన్యం స్పందించడం లేదని వాపోయారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే దారిలో వెళ్లడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి గేటును పునఃప్రారంభించి చిన్నారుల కష్టాలను తీర్చాలని కోరారు.

తెగుళ్ల నివారణకు సత్వర చర్యలు చేపట్టాలి

కొయ్యూరు, సెప్టెంబరు 24: ఆకు ముడత, అగ్గి తెగులు నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి సూచించారు. రావణాపల్లి, కొండగోకిరి రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వరి పంట పొలాలను పరిశీలించి ఆకుముడత తెగులు, అగ్గి తెగులు ఉన్నట్టు గుర్తించారు. వీటి నివారణ చర్యలపై ఏవో ఉమాదేవి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి రాజేష్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు, పాలకులు సమన్వయంతో పనిచేయాలి

- అధికారులు విధిగా హాజరుకావాలి: సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రత్నకుమారి

పాడేరు రూరల్, సెప్టెంబరు 24: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సొనాయి రత్నకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని ప్రభుత్వ అధికారులు హాజరు కావాలన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులకు వివరించారు. అనంతరం ఎంపీపీ రత్నకుమారితో కలిసి ఎంపీడీవో కె.సాయినవీన్, తహసీల్దార్ వంజంగి త్రినాథరావునాయుడు తదితరులు రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన స్వర్ణాంధ్ర-2047 పోస్టర్లను ఆవిష్కరించారు. తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లనున్న ఎంపీడీవో నవీన్‌ను సత్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర-2047 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

అరకులోయ, సెప్టెంబరు 24: స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో నియోజకవర్గ క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపిక కోసం నిర్వహిస్తున్న వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, యోగా పోటీల్లో పాఠశాలల నుంచి అండర్-14 విభాగంలో 306 మంది, అండర్-17 విభాగంలో 306 మంది బాలికలు మొదట రోజు పాల్గొన్నారు. బుధవారం అండర్-14, 17 విభాగాల్లో 612 మంది బాలురు పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.కొండబాబు తెలిపారు. ఈ పోటీల్లో క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్.మూర్తి, రవ్వలగుడ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు కెందూ, మోహనరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మాజీ కార్యదర్శి సూరిబాబు, సహాయ కార్యదర్శి బాలి, నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



చదరంగం పోటీలో తలపడుతున్న బాలికలు

అందాల జలపాతాలు.. ఆదమరిస్తే ప్రమాదాలు

... 5వ పేజీ తరువాయి

మృతదేహాలను వెలికితీసేందుకు అధికారులు అష్టకష్టాలు పడ్డారు.

పిట్టలబొర్రా జలపాతం ప్రమాదకరం

పెదబయలు మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్రా జలపాతం ప్రమాదకరంగా ఉంటుంది. గతంలో ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి. మూడు నెలల క్రితం అరకు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు సెల్ఫీ తీసుకుంటుండగా ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడి గల్లంతయ్యాడు. రెండు రోజులు తరువాత మృతదేహం లభ్యమైంది. అలాగే ఆంధ్ర, ఒడిశా సరహద్దులో 2,600 అడుగులు ఎత్తులోని డుడుమ జలపాతం పరవళ్లు తొక్కుతుంది. ఈ జలపాతం వద్ద గతంలో ఆరుగురు వరకు మృత్యువాత పడ్డారు.. దీంతో ఒడిశా ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం ప్రమాదాలు చోటుచేసుకోవడం లేదు. కొయ్యూరు మండలంలోని గాదిగుమ్మి జలపాతం అత్యంత ప్రమాదకరమైంది. ఈ జలపాతంలో జారిపడినవారు బతికి బయటపడిన సందర్భాలు లేవు. గతంలో సుమారు 40 మంది వరకు మృత్యువాత పడ్డారు. ఇక మోతుగూడెం వద్ద ఉన్న పొల్లూరు జలపాతానికి విశేష ఆదరణ ఉంది. ఇక్కడ సినిమా షూటింగ్‌లు ఎక్కువ జరుగుతుంటాయి. అయితే జలపాతం వద్ద బండరాళ్ల ప్రదేశంలో ఊబి ఉండడంతో ఇప్పటి వరకు సుమారు 35 మంది ప్రాణాలు కోల్పోయారు.



చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు

చాపరాయి జలపాతం వద్ద..

డుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి జల విహారి పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటోంది. విదేశీ పర్యాటకులు కూడా ఇక్కడికి వస్తుంటారు. ఈ జలపాతం దిగుడు రాయిని ఆనుకుని హనుమ రాయి ఉంది. ఇక్కడ లోతుగా ఉండడంతో ఈ విషయం తెలియని పర్యాటకులు ఇందులో దిగి ప్రమాదాలకు గురయ్యారు. గత దశాబ్ద కాలంలో సుమారు 30 మంది మృతి చెందారు. రెండేళ్ల క్రితం అధికారులు చాపరాయి జల విహారిని ఆధునికీకరించారు. ప్రమాదాలు జరుగుతున్న హనుమ రాయిని బ్లాస్ట్ చేసి చుట్టూ కంచె ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. రెండేళ్లుగా చాపరాయి జల విహారిలో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.

సంక్షిప్తంగా..

కొయ్యూరు ఎంపీడీవోగా రమేష్‌నాయుడు



కొయ్యూరు, సెప్టెంబరు 24: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా బి.రమేష్‌నాయుడును నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీవో మేరీరోస్‌ను అనకాపల్లి జిల్లాలోని గొలుగొండ మండలానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో సబ్బవరం ఎంపీడీవోగా పనిచేస్తున్న రమేష్‌నాయుడును నియమించారు. గత సబ్బవరంలో పనిచేసే క్రమంలో రమేష్‌నాయుడు జాతీయ స్థాయిలో ఉత్తమ ఎంపీడీవో పురస్కారాలకు రెండు దఫాలు ఎంపికయ్యారు.

గురుకుల కళాశాలలో వసతి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఈఎంఆర్ఎస్ కన్సల్టెంట్ రంగారావు

చింతపల్లి, సెప్టెంబరు 24: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో వసతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అమరావతి ఈఎంఆర్ఎస్ కన్సల్టెంట్ ఎస్.రంగారావు చెప్పారు. టీడబ్ల్యూ గురుకుల కళాశాలను మంగళవారం సందర్శించి తరగతి, వసతి గదులు, ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు వసతి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్యను గురుకులం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అదనపు తరగతి గదులు, వసతి గృహాలు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యా బోధన అందించడం శుభపరిణామని ప్రిన్సిపాల్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామేశ్వరం పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోండి

పాడేరు రూరల్, సెప్టెంబరు 24: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పిలుం పిలుస్తోంది కార్యక్రమాన్ని గిరిజన ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సూచించారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువస్తుందన్నారు. ఈ పథకాలను రైతులు వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, డప్పోడి వెంకటరమణ, బుద్ద జ్యోతికిరణ్, కిట్లంగి పద్మ, దివ్యలత పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల మరణాలపై అధికారులు స్పందించాలి

పాడేరు రూరల్, సెప్టెంబరు 24: జిల్లాలోని వివిధ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలల వసతి గృహల్లో విద్యార్థుల మరణాలపై ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వి.కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యనభ్యసిస్తున్న పూజారి లక్ష్మీప్రియ అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందితే, వసతి గృహ నిర్వాహకురాలు కనీసం స్పందించకపోవడం విచారకరమని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థిని మృతికి కారణమైన మేట్రిన్‌పై చర్యలు చేపట్టాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహాల్లో హెల్త్ వర్కర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.తనీష్, విజయ్, హరిత, అనురాధ, కుమారి తదితరులు పాల్గొన్నారు.


జాతీయ సేవా పథకంపై విద్యార్థులకు ఆసక్తి అవసరం

చింతపల్లి, సెప్టెంబరు 24: విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్)పై ఆసక్తి పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ అలవర్చుకోవాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో పాల్గొంటే విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ లభిస్తుందన్నారు. అనంతరం చింతపల్లి వచ్చిన టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యా ప్రగతి కోసం ప్రిన్సిపాల్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.లీలాపావని, గ్రంథాలయాధికారి జగ్గత్‌రాయ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 24: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభదాయకమైన దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ కంటా జాహ్నవి అన్నారు. దుశ్చరిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆదివాసీలు సేంద్రియ పద్ధతిలోనే పంటలు సాగు చేసుకోవాలన్నారు. జీవామృతం, బీజామృతం, కషాయాలు ఉపయోగిస్తే ఎంతో మేలని చెప్పారు. శాస్త్రవేత్త బాల హుస్సెన్ రెడ్డి మాట్లాడుతూ వరి పంటలో అగ్గి తెగులును సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అధిక వర్షాల వల్ల పంటల్లో నీరు నిల్వ లేకుండా బయటకుపోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో మధుసూదనరావు, ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, ఉప సర్పంచ్ ఎం.సోమేశ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కలి మహేశ్, పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ముహూర్తపు రాట



ఉత్సవాల ముహూర్తపు రాటను వేస్తున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 24: ధారకొండ పంచాయతీ ఏనుగుబయలులో మంగళవారం దసరా ఉత్సవాల ముహూర్తపు రాటను వేశారు. దేవీ నవరాత్రుల 11వ వార్షిక మహోత్సవాలు పురస్కరించుకుని స్థానిక రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నవరాత్రి ఉత్సవాలను వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్లి రామయ్య సరస్వతీరావు తదితర్లు పాల్గొన్నారు.

క్రైం... crime news

పూరింటికి నిప్పంటించిన వ్యక్తిపై కేసు నమోదు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 24: మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో ఒక పూరింటికి నిప్పంటించిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఉప్పరాపల్లిలో సేనాపతి ఆదిలక్ష్మికి చెందిన ఖాళీగా వున్న పూరింటికి అదే గ్రామానికి చెందిన సేనాపతి నూకరాజు అనే వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున నిప్పు అంటించాడు. దీంతో ఇల్లు మొత్తం కాలిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంతోపాటు ఇంటిలో భద్రపరిచిన పలు వస్తువులు దగ్ధమయ్యాయి. నూకరాజు మద్యం మత్తులో పూరింటికి నిప్పు పెట్టినట్టు స్థానికులు చెప్పడంతో ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సేనాపతి నూకరాజుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- మరొకరికి గాయాలు
- తాటిచెట్లపాలెం జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్న బైక్


మృతులు ప్రవీణ్, ప్రశాంత్ (ఫైల్ ఫొటోలు)

విశాఖపట్నం, సెప్టెంబరు 24 : జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం జంక్షన్ సమీపంలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. సీతంపేట ప్రాంతానికి చెందిన ప్రవీణ్ (24), దొండపర్తికి చెందిన ప్రశాంత్ (22), కంచరపాలేనికి చెందిన మహేష్ (20) స్నేహితులు. వీరు ముగ్గురూ ఉదయం స్థానిక ఊర్వశి జంక్షన్ నుంచి ద్విచక్ర వాహనంపై తాటిచెట్లపాలెం వైపు బయలుదేరారు. తాటిచెట్లపాలెం జంక్షన్‌కు కొద్దిగా ముందు సంజీవయ్య నగర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న ప్రవీణ్ (24), మధ్యలో కూర్చున్న ప్రశాంత్ (22) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చున్న మహేష్(20)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరధి ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. సీఐ దాశరధి నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులను ట్రైన్ ఎక్కించి...

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రవీణ్ రిటైర్డు ఆర్మీ ఉద్యోగి లక్ష్మణరావు కుమారుడు. వీరు సీతంపేట గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఊరు వెళుతున్న తల్లితండ్రిని ప్రవీణ్ ట్రైన్ ఎక్కించి, దొండపర్తిలో నివాసం ఉంటున్న స్నేహితుడు ప్రశాంత్‌ను తన బైక్‌పై తీసుకుని కంచరపాలెంలో ఉంటున్న మహేష్ వద్దకు వచ్చాడు. అక్కడ నుంచి ముగ్గురూ సీతంపేటలోని ప్రవీణ్ ఇంటికి బయలుదేరారు. సరిగ్గా సంజీవయ్య కాలనీ దగ్గరకి వెళ్లేసరికి వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుంది. ప్రవీణ్ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ప్రశాంత్ ఇంటర్ మధ్యలో ఆపేశాడు. గాయపడిన మహేష్ పెందుర్తి సమీపంలో గల వెల్ఫేర్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు.

'సాంకేతిక పరిజ్ఞానం రైతులకు చేరువ కావాలి'

అచ్యుతాపురం, సెప్టెంబరు 24: వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు దగ్గరవడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.ప్రభాకరరావు అన్నారు. మంగళవారం కొండకర్ల, హరిపాలెంలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ అధికారుల సూచనలు పాటించి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అలాగే ఉద్యాన శాఖ నుంచి డ్రిప్, స్ప్రింక్లర్లు పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శంకర్ గోవింద, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి తులసీమణి, ఏఈఓ కేబీ సూర్యనారాయణ, వీఏఏలు రాజకుమార్, ఆర్.లోకేష్ పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఏర్పాటు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాట కమిటీ ఏర్పాటైంది. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీని నియమించారు. కమిటీ జిల్లా కన్వీనర్‌గా ఆర్.దొరబాబు, కో-కన్వీనర్‌గా ఆర్. శంకరరావు, కమిటీ సభ్యులుగా కర్రి అప్పారావు, రెడ్డి అప్పలరాజు, గాడి బాలు, ఎం.రమణ, డీడీ వరలక్ష్మి, పి.మాణిక్యం, జి.కోటేశ్వరరావు, కె.శంకరరావులతో కమిటీ ఏర్పడిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. ఉక్కు పరిరక్షణకు అక్టోబరు రెండో తేదీ నుంచి నాల్గో తేదీ వరకు రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నామన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు కేతన్‌సాయికౌశిక్ ఎంపిక


కేతన్‌సాయికౌశిక్

సీలేరు, సెప్టెంబరు 24 : జీకేవీధి మండలం సీలేరుకు చెందిన ఎం.కేతన్‌సాయికౌశిక్ జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రతిభను కనబరిచి వచ్చే నెలలో లఢఖ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున అర్హత సాధించాడు. సీలేరులో ఏపీ జెన్‌కో ఉద్యోగి ఎం.జోగారావు కుమారుడైన ఎం.కేతన్‌సాయికౌశిక్ విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఎంపీసీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్- 19 విభాగంలో విశాఖపట్నం జిల్లాలో టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విశాఖ జిల్లా తరఫున ఆడి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్లు

- ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్ల (ఎస్‌ఈ)ను నియమిస్తూ ఏపీఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ సహా, ఇతర శాఖలకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటైనప్పటికీ విద్యుత్ పంపిణీ సంస్థలు మాత్రం ఉమ్మడి జిల్లా కేంద్రంగానే ఇన్నాళ్లు కార్యకలాపాలు నిర్వహించాయి. జిల్లా కలెక్టర్లు సమావేశాలు నిర్వహించినప్పుడు ఒక ఎస్‌ఈనే ఆ జిల్లాకు, ఈ జిల్లాకు తిరగడం ఇబ్బందిగా మారడంతో తప్పనిసరిగా ఎస్‌ఈలను నియమించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో అందుబాటులో ఉన్నవారినే కొత్త జిల్లాలకు ఎస్‌ఈలుగా నియమించారు. వారికి సహాయంగా ఒక డిప్యూటీ ఇంజనీర్ (టెక్నికల్), ఇద్దరు ఏఈలు, ఇద్దరు జూనియర్ ఇంజనీర్లు, అకౌంటింగ్ అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఇచ్చారు. ఇలా మొత్తం 12 మందితో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జిల్లా సర్కిల్ ఎస్‌ఈగా గొప్పు ప్రసాద్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ సర్కిల్ ఎస్‌ఈగా ఎస్.రాజాబాబు, పార్వతీపురం మన్యం సర్కిల్ ఎస్‌ఈగా కె.చలపతిరావు, అల్లూరి సీతారామరాజు సర్కిల్ ఎస్‌ఈగా జీఎస్ ప్రసాద్, కాకినాడ ఎస్‌ఈగా గొర్లె ప్రసాద్‌లను నియమించారు.

నేటి నుంచి మునగపాకలో రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు

విశాఖపట్నం, సెప్టెంబరు 24: అనకాపల్లి జిల్లా మునగపాకలో మరిడిమాంబ జాతర సందర్భంగా బుధవారం నుంచి రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు విద్యుద్దీప కాంతుల్లో మ్యాట్‌పై నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే జట్టుకు రూ.25 వేలు, ద్వితీయ స్థానానికి రూ.20 వేలు, మూడు, నాలుగు సానాల్లో నిలిచే జట్లకు రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. వివరాలకు 7680005666 సెల్ నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

అప్పులకుప్పగా రాష్ట్రం

రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశారు

- చివరకు శ్రీవారి ప్రసాదాన్నీ వదలలేదు
- మాజీ సీఎం జగన్‌పై మంత్రి అనిత ధ్వజం
- చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని కితాబు


'ఇది మంచి ప్రభుత్వం' సభలో మాట్లాడుతున్న మంత్రి వంగలపూడి అనిత

కోటవురట్ల, సెప్టెంబరు 24: జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేయగా, సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కోటవురట్ల మండలం పీకేపల్లిలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ, గత సీఎం జగన్‌రెడ్డి రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశారని, చివరకు తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని కూడా వదిలిపెట్టలేదని ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వంపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. కాసులకు కక్కుర్తిపడి శ్రీవారి లడ్డూప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యిని వినియోగించారని మంత్రి ఆరోపించారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


సభకు హాజరైన ప్రజలు

కోటవురట్ల మండలంలో వరహా నదిపై జల్లూరు, పందూరుల వద్ద గత టీడీపీ హయాంలో వంతెనల నిర్మాణ పనులుచేపట్టగా, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఐదేళ్లపాటు పనులు చేయకుండా గాలికొదిలేశారని మంత్రి అనిత విమర్శించారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత వంతెన పనులను పునరుద్ధరించామని చెప్పారు. వైసీపీ హయాంలో చేసిన కొద్దిపాటి అభివృద్ధి పనులకు కూడా బిల్లులు చెల్లించలేదని, ఇప్పుడు ఆ బిల్లులను తమ ప్రభుత్వం చెల్లిస్తున్నదని చెప్పారు. పీకేపల్లిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీఇచ్చారు. అంతకుముందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలంకాశీనాయుడు, మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, కూటమి పార్టీల నేతలు తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్, అబ్బం, పెట్లలింగం నాయుడు, శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ, తహసీల్దార్ జానకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేవల్‌బేస్ నిర్వాసితులకు మేలు చేద్దాం

- ఎన్‌ఏవోబీ నిర్వాసితుల సమావేశంలో హోం మంత్రి అనిత


నేవల్‌బేస్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 24: ఎన్‌ఏవోబీ కోసం భూములిచ్చిన వాకపాడు, బంగారమ్మపాలెం, వాతాడ గ్రామాల నేవల్‌బేస్ నిర్వాసితులకు అన్నివిధాల మేలు చేయాలని, మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన నివాసంలో ఎన్‌ఏవోబీ నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ దీపిక, ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత నిర్వాసిత మత్స్యకారులు మాట్లాడుతూ దేశరక్షణ కోసం తాము భూములను ఇచ్చామని, తమ జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించి, జెట్టీ నిర్మించాలని కోరారు. గతంలో బంగారమ్మపాలెం మత్స్యకారులపై పెట్టిన కేసుల నుంచి ఉపశమనం కలిగించాలని కోరారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ బంగారమ్మపాలెం గ్రామస్థులపై గతంలో వున్న కేసులను పరిశీలించి, సాధ్యమైనంత వరకూ వారికి న్యాయం చేయాలని ఎస్పీ దీపికకు సూచించారు.

మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. బంగారమ్మపాలెంలో కల్వర్టులు నిర్మిస్తామని చెప్పారు. ఎన్‌ఏవోబీ నిర్వాసితుల సమస్యలపై మరోసారి అధికారులతో విస్తృత సమావేశం నిర్వహించాలని ఈ గ్రామాల ప్రజలు హోం మంత్రిని కోరారు.

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం

- ఆర్డీవో చిన్నికృష్ణ

పరవాడ, సెప్టెంబరు 24 : ఫార్మా పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ సూచించారు. ఫార్మాసిటీలోని ఎంఎస్ఆర్ఎం సమావేశమందిరంలో మంగళవారం ఫార్మా ప్రతినిధులు, ఉద్యోగులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యాలు భద్రతపై దృష్టి సారించాలన్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదం వంటివి పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వాలన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించడంతో పాటు భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ పి.చిన్నారావు, జెఎన్‌పీసీ అసోసియేషన్ కార్యదర్శి జెట్టి సుబ్బారావు, వాకా చంద్రశేఖరరెడ్డి, హనుమంతు లక్ష్మణరావు, బి. రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు మద్దతుగా పాదయాత్ర

- జనసేన రాష్ట్ర కార్యదర్శి శివదత్

నక్కపల్లి, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ విషయమై తీవ్ర ఆవేదన చెందిన ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మద్దతుగా తాము పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్టు జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ చెప్పారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. 28వ తేదీ ఉదయం పాయకరావుపేట పాండురంగస్వామి దేవస్థానం నుంచి ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకూ జనసైనికులతో కలిపి పాదయాత్ర చేపడతానన్నారు.

తిరుమల పవిత్రతను నాశనం చేసిన వైసీపీ పాలక మండళ్లు

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


శిబిరం వద్ద మాట్లాడుతున్న కొణతాల

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24 : వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో తిరుమల పవిత్రతను ఆ పార్టీ పాలకమండళ్లు నాశనం చేశాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో మంగళవారం నిర్వహించిన ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఆయన మాట్లాడారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిను కూడా కల్తీ చేయించిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. లడ్డూ ప్రసాదంలో అవినీతికి పాల్పడిన వారిని శిక్షిస్తామన్నారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిని విడిచిపెట్టరాదన్నారు. తిరుమల లడ్డూ అంటే ప్రపంచ దేశాల్లో ఎంతో ఖ్యాతి ఉందన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఒక మతానికి సంబంధించినది కాదని అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలకు సంబంధించిన అంశమన్నారు. జగన్ హయాంలో జరిగిన మద్యం అమ్మకాలపై కూడా విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, కూటమి నాయకులు ఆళ్ల రామచంద్రరావు, దూలం గోపి, మళ్ల సురేంద్ర, కాయల మురళీ, తాడి రామకృష్ణ, సతీష్, మళ్ల శ్రీను, పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు సహకారం

- ఉపాధి పథకం కింద షెడ్లు మంజూరు
- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామ్మోహనరావు


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24: గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన మంగళవారం స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామ్మోహనరావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద మొదటి దఫాలో ప్రతి మండలానికి 25 చొప్పున గొర్రెల షెడ్లు మంజూరు చేస్తామని చెప్పారు. అక్టోబరు, జనవరి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలోని అన్ని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. చైర్మన్ గంటా శ్రీరామ్.. గత ఆరు నెలల కార్యకలాపాలను సమావేశంలో వివరించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శీనుబాబు, పశువైద్యాధికారి భానుమూర్తి, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ దేవర సత్యనారాయణ, పినబోయిన అప్పారావు, గోకాడ దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు రాష్ట్ర జట్లు రెడీ

- బాలురు, బాలికలకు ముగిసిన శిక్షణ
- 30 నుంచి వచ్చే నెల 4 వరకు జమ్ములో పోటీలు



జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలురు, బాలికల జట్లు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 24: జమ్ము-కశ్మీర్ రాష్ట్రంలోని జమ్ములో సెప్టెంబరు 30వ తేదీ నుంచి అక్టోబరు నాలుగో తేదీ వరకు జరిగే 36వ జాతీయ సబ్ జూనియర్ బాలురు, బాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 16వ తేదీ నుంచి శిక్షణ ఇస్తున్నట్టు టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైడీ రామారావు, కేఎస్‌వీ సత్యనారాయణలు తెలిపారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో కె.జ్యోతిక, హెచ్.స్పందన, హెచ్.దీక్షిత (అనంతపురం), ఆర్.సంస్కృతి (పశ్చిమగోదావరి), కె.ఇందు (విజయనగరం), పి.శ్రావణ (శ్రీకాకుళం); బాలుర విభాగంలో ఎన్.గౌతమ్‌సంజయ్ (అనంతపురం), ఎస్.సాయికుమార్ (విజయనగరం), కె.శివశంకర్ ప్రసాద్ (తూర్పుగోదావరి), జి.మహీధర్ (అనంతపురం), బి.సత్యనారాయణ (తూర్పుగోదావరి), డి.రోహిత్ (విశాఖపట్నం) పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కోచ్ జి.రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్, అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారుడు పీజేఎండీ రామారావు, వి.వినయ్‌కుమార్, యల్లపు గోవింద, పి.రమణారావు శిక్షణ ఇచ్చారన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు అయ్యన్న విద్యాసంస్థలు రూ.1.5 లక్షల విరాళం


ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి విరాళం అందజేస్తున్న అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ కాశీం

కె.కోటపాడు, సెప్టెంబరు 24: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుకు వచ్చిన అయ్యన్న విద్యాసంస్థల యాజమాన్యం అభినందనీయమని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సీఎం సహాయ నిధికి అయ్యన్న విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఒక లక్షా 53 వేల 650 రూపాయలు విరాళంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ చదువు ఒక్కటే కాకుండా వివిధ సేవా కార్యక్రమాలతో పాటు బాధితులకు అండగా నిలవడం అయ్యన్న విద్యాసంస్థలు అభినందనీయమని కరస్పాండెంట్ కాశీంను అభినందించారు. ఈ కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, బీజేపీ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, బత్తి రమణ, దోకల నరసింహమూర్తి, పూడి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో శాంతి హోమం


సింహాచలం దేవస్థానంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న రుత్వికులు

- దోష నివృత్తికి చర్యలు

సింహాచలం, సెప్టెంబరు 24: రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ప్రసాదాల తయారీలో చోటుచేసుకున్న దోషాల నివృత్తికి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో శాంతిహోమం నిర్వహించారు. హోమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మహా సంప్రోక్షణ

సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కూడా ప్రసాదాల తయారీకి నాణ్యత లేని నెయ్యి వాడినట్టు ప్రాథమికంగా నిర్ధారించిన తరుణంలో ఆ అపచార పరిహారార్థం మంగళవారం మహా సంప్రోక్షణ గావించారు. ఆలయ పరిసరాలు, ప్రసాదాల తయారీకి కావలసిన ముడి సరకులు నిల్వ ఉంచే ప్రధాన స్టోర్స్ ప్రసాదాలు తయారుచేస్తున్న పొయ్యిలను ప్రోక్షణ చేశారు.

నేడు మంత్రి నారా లోకేశ్ విశాఖ రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం నగరానికి రానున్నారు. ఆయన ఉదయం ఎనిమిది గంటలకు విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి 8.50 గంటలకు విశాఖపట్నం వస్తారు. విమానాశ్రయం నుంచి నేరుగా నోవాటెల్ హోటల్‌కు చేరుకుని సీఐఐ సదస్సుకు హాజరవుతారు. మధ్యాహ్నం మూడు గంటల వరకూ అక్కడే ఉంటారు. అనంతరం మధురవాడ వెళ్లి అదానీ గ్రూపునకు డేటా సెంటర్ ఏర్పాటునిమిత్తం కేటాయించిన కొండను సందర్శిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 5.20 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకుని నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. కాగా ఈనెల 26వ తేదీన కూడా లోకేశ్ పలు కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. అయితే దీనికి సంబంధించి అధికారికంగా ఎటువంటి సమాచారం రాలేదు. మంత్రి లోకేశ్ మంగళవారం రాత్రికి నగరానికి రావల్సి ఉంది. అయితే విజయవాడలో పలు కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున ఆయన రాక బుధవారానికి వాయిదా పడింది.

వరి పొలాల్లో పాయలతో దోమపోటు దూరం

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

మాకవరపాలెం, సెప్టెంబరు 24: వరి పొలాల్లో దోమపోటు లేకుండా పాయలు తీయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం గిడుతూరు గ్రామంలో జిల్లా వ్యవసాయ అధి కారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ నుంచి ఈ కార్యక్రమం వారానికి రెండు రోజుల పాటు రైతు సేవా కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటిగా క్షేత్ర పర్యటన, తుది పరి రైతులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు వినియోగం తగ్గిస్తే వరిపంట దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. అలాగే తెగుళ్ళు రాకుండా వ్యవసాయ అధికారులు అందించే సూచనలను రైతులు పాటించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలు తప్పనిసరిగా తమ వివరాలు ఈ పంటలో నమోదు చేసుకోని కేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం గిడుతూరు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, టీడీపీ నాయకులు చినబాబు, బుచ్చిరాంప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సులభంగా అర్థమయ్యే రీతితో గణిత బోధన

- డీఈవో వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం, సెప్టెంబరు 24: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో గణిత శాస్త్రం బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ సూచించారు. మంగళవారం గణిత శాస్త్రం బోధనపై జడ్పీహెచ్ స్కూల్(మెయిన్)లో డివిజన్ స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 12 మండలాలకు సంబంధించి ఎంఈవోలు, ఎంపికైన కేఆర్‌పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా ఉపాధ్యాయులు, పిల్లలు పాఠశాలలో ఉండాలన్నారు. ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకుంటూ అభివృద్ధి పథకంలో నడిపించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదని సూచించారు.

నిండుకుండలా కోనాం జలాశయం

చీడికాడ, సెప్టెంబరు 24: మండలంలో కోనాం జలాశయం నిండుకుండలా కళకళలాడుతోంది. మంగళవారం ఉదయానికి జలాశయం ఎగువ ప్రాంతాల నుంచి అధికశాతం వరదనీరు చేరింది. ఈ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, మంగళవారం సాయంత్రానికి 99.30 మీటర్లకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి 300 క్యూసెక్కులు వరదనీరు వస్తుండగా.., ఎగువ, దిగువ కాలువల ద్వారా మెయిన్‌గేటు నుంచి 180 క్యూసెక్కుల వరకూ సాగునీరు విడుదల చేస్తున్నట్టు ఏఈ సీహెచ్ జయరాం పడాల్ విలేకరులకు తెలిపారు.